ప్రజాశక్తి

శుక్రవారం 6 డిసెంబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



నిరసనకు దిగిన రైతులతో చర్చిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ

కృష్ణా కరకట్టపై రైతుల నిరసన

- ధాన్యం కొనుగోళ్లకు డిమాండ్
- కలెక్టర్ హామీతో విరమణ

కృష్ణాజిల్లాలో ధాన్యం రైతులు రోడ్డెక్కారు. తోట్లవల్లూరు మండలం వల్లూరు పాలెం, రొయ్యూరు, బొడ్డపాడు, చిన్న పులిపాక గ్రామాల రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. వల్లూరుపాలెం వద్ద కష్ణానది కరకట్టపై ధర్నా, రాస్తారోకోకు దిగారు. దీంతో కరకట్టపై రాకపోకలు స్తంభించాయి. ఆరుగాలం కష్టించి పంట పండించిన తమను దళారులు, అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై దోచుకుంటున్నారని రైతులు నిరసన వ్యక్తం చేశారు. 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొన్న ధాన్యానికి సకాలంలో డబ్బులు జమ వేయాలని, మద్దతు ధర చెల్లించాలని రైతులు నినదిస్తూ రాస్తారోకో చేశారు.

(పూర్తి వివరాలు మెయిన్ పేజీలో)

ఆర్ఎస్‌కె సిబ్బంది సర్దుబాటు

- వ్యవసాయ భూముల హెచ్చుతగ్గుల నేపథ్యంలో చర్యలు
- అగ్రి ల్యాబ్‌లకు విస్తరణాధికారుల బదిలీ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె) సిబ్బంది సర్దుబాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆర్ఎస్‌కెల పరిధిలో వ్యవసాయ భూముల హెచ్చుతగ్గులు భారీగా ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఒక్కో ఆర్ఎస్‌కె పరిధిలో వెయ్యి ఎకరాల నుంచి 1,500 ఎకరాలు విస్తీర్ణంలోని రైతులకు సేవలందించే విధంగా వ్యవసాయశాఖ నివేదికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పటికే ఆర్ఎస్‌కెల్లో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇవో)లను అగ్రి ల్యాబ్‌లకు బదిలీ చేసింది. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలోని వ్యవసాయ, ఉద్యానవన, సెరీకల్చర్ (పట్టుపరిశ్రమ) శాఖల సహాయకులను ఆయా శాఖల పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

కృష్ణా జిల్లాలోని 390 ఆర్ఎస్‌కెల పరిధిలో 5 లక్షల 64 వేల 658 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందుకుగాను 337 మంది వ్యవసాయ సహాయకుల (విఎఎ) పోస్టులను ఏర్పాటు చేశారు. విఎఎలు తమ విధుల్లో భాగంగా వ్యవసాయ పంటల వివరాలతో ఈ క్రాప్ నమోదు చేయడం, క్రాప్ ఇన్సూరెన్స్, పంట కోత (మిగతా 2లో)

ఎన్‌టిఆర్ జిల్లాలో 157 ఆర్ఎస్‌కెలు

- ధాన్యం దిగుబడి 2.37 లక్షల టన్నులు
- కొనుగోలు లక్ష్యం లక్ష టన్నులు
- ఇప్పటికి కొనుగోలు 23,695 టన్నులు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 157 ఆర్ఎస్‌కెలు ఉన్నాయి. మొత్తం 88,540 ఎకరాల్లో వరి సాగు చేశారు. వ్యవసాయ శాఖ సుమారు 2 లక్షల 36 వేల 803 టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అలాగే తిరువూరు డివిజన్లో 6 లక్షల 24 వేల 210 గోనె సంచులు, విజయవాడ డివిజన్లో 2 లక్షల 69 వేల 750, నందిగామ డివిజన్లో 2.60 లక్షల గోనె సంచులను సమకూర్చింది. ఆర్ఎస్‌కెల్లో అవసరమైన లేబర్, జిపిఎస్ అమర్చిన 291 రవాణా వాహనాలను అందుబాట్లో ఉంచింది. గోనె సంచులు, రవాణా వాహనాలు అవసరమైన వారికి ముందస్తుగా కూడా ఇస్తామని అధికారులు ప్రకటించారు. ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాకు గ్రేడ్ - ఎ రూ.2,320, కామన్ రకం రూ.2,300గా నిర్ణయించారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3,246 రైతుల వద్ద నుండి మొత్తం 23,695.200 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీని మొత్తం విలువ రూ.51.08 కోట్లుగా ఉంది. దీనిలో రైతులకు రూ.47.97 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.3.11 కోట్లు అందుబాట్లో ఉన్నాయి. ఒక పంట కాలంలో ఒక రైతు నుండి గరిష్టంగా 25 ఎకరాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ఎంటియు 1282తోపాటు ఎంటియు 1262 కూడా (మిగతా 2లో)

రైతులను దోచుకుంటున్న మిల్లర్లు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు
- ధాన్యం రైతుల ఇక్కట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఘంటసాల : రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణలో ప్రభుత్వానికీ, మిల్లర్లకూ మధ్య సమన్వయం లేదని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ప్రభుత్వం చెబుతున్నదొకటి, మిల్లర్లు చేస్తున్నదొకటని విమర్శించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ రైతులకు అనుకూలంగా కాక మిల్లర్లకు దోచి పెట్టేలా ఉందన్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో గత పది రోజుల నుంచి రోడ్లపైనే ఆరబెట్టి ఉన్న ధాన్యాన్ని సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో తేమ శాతం 17, 18 చూపిస్తే, అదే ధాన్యం మిల్లరు వద్ద 23 నుంచి 25 శాతం చూపిస్తోందని అన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తేమశాతం సాకుగా చూపి మిల్లర్లు ఒక శాతానికి కిలో చొప్పున రైతులను దోచుకుంటున్నారని చెప్పారు. కొంతమంది మిల్లర్లు బస్తా 1200కు సైతం తీసుకున్న సందర్భాలున్నాయన్నారు. ఒకసారి రైతు సేవా కేంద్రంలో తేమశాతం నిర్ధారించిన తర్వాత మిల్లరు ప్రమేయం ఎందుకొస్తోందని ప్రశ్నించారు. మిల్లర్లను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, నాయకులు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు, కంచర్ల నాగరాజు, భలే రమేష్, గొరుముచ్చు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం బాగున్నా రూ.1400కి అడుగుతున్నారు

మేరుగు మధు, కౌలు రైతు



తొమ్మిది ఎకరాల్లో 1061 రకం వరి సాగుచేశా. పది రోజుల క్రితం మిషన్ ద్వారా కోత కోసి వారం నుంచి రోడ్లపైన ఆరబెడుతున్నా. రైతు సేవా



రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు

కేంద్రంలో 20 శాతం తేమ చూపింది. అయితే మిల్లరు వద్ద 23 శాతం తేమ చూపింది. మిల్లరు 17 కన్నా తేమశాతం ఎక్కువగా ఉందని బస్తాకు రూ.1500 మాత్రమే ఇస్తానంటున్నాడు. పొలం గల రైతు మాత్రం కౌలు కింద ప్రభుత్వ మద్దతు ధర రూ.1700 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇలా అయితే కౌలు రైతులు ఎలా బతకాలి ?

రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరగడం సరిపోతోంది

కొలుసు చందు, కౌలు రైతు, కొత్తపల్లి



కోత కోసి వారం రోజులవుతోంది. రైతు సేవా కేంద్రాల చుట్టూ, మిల్లర్ల చుట్టూ తిరగడం సరిపోతోంది. ఒక్కోసారి ఒక్కో తేమశాతం చూపి నాలుగైదు కిలోలు తక్కువకు తీసుకుంటామంటున్నారు. అధికారులైతే కొన్ని రోజులు ఆరబెట్టి తీసుకురావాలంటున్నారు. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు భయపెడుతున్నాయి.

మంత్రి మాటలు బేఖాతర్

వాకా రామచంద్రరావు, కౌలు రైతు సంఘం నాయకులు



ధాన్యం కొనుగోలులో మంత్రి మాటలు సైతం పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఘంటసాల మండలంలో పర్యటించి ధాన్యం కొనుగోలులో వస్తున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని, దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా చూడాలని ఆదేశించారు. కానీ మంత్రి మాటలు ఎక్కడా అమలు కావడం లేదు.



బ్రోచర్ ఆవిష్కరణలో సూర్యకుమారి

మహిళలు, బాలల భద్రత, రక్షణే లక్ష్యం

రాష్ట్ర మహిళాభివద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహిళలు, బాలల భద్రత, రక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్య కుమారి తెలిపారు. ముఖ్యంగా నిస్సహాయ స్థితిలో ఉన్న నేపథ్యాల నుండి వచ్చిన, వివిధ రకాల హింసలకు గురవుతున్న మహిళలు, బాలల భద్రతకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ చేపడుతోందన్నారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 16 రోజుల ప్రచారంలో భాగంగా హెల్ప్ సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, బాలికల భద్రత, రక్షణ'పై రెండురోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి కార్యశాలకు గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, దోపిడీ, అక్రమ రవాణాతోపాటు లింగ ఆధారిత హింసతో సహా వివిధ రకాల హింసలకు గురయ్యే ప్రమాదంలో ఉన్న మహిళలు, బాలికలను గుర్తించాలన్నారు. కార్యశాలకు అధ్యక్షత వహించిన మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వై. శైలజ మాట్లాడుతూ భాదిత మహిళలు, బాలల పునరావాసం కోసం శాఖ అధ్వర్యంలో నడుపుతున్న సంబంధిత ప్రభుత్వ షెల్టర్ హోమ్‌ల ద్వారా తక్షణ ప్రతిస్పందనను, అవసరమైన చర్యలను ప్రారంభించాలన్నారు. హెల్ప్ సంస్థ సెక్రటరీ రామ్ మోహన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, దోపిడీ, ఇతర రకాల హింసలను అరికట్టడానికి ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ప్రాజెక్ట్ డైరెక్టర్లు సువర్ణ, ఉమ, రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మహిళా శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారులు, ఈ.ఓ.లు, శక్తి సదన్‌ల, వన్‌స్టాప్ సెంటర్‌ల నిర్వహణాధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలను పరిష్కారానికి కృషి

సిపి రాజశేఖరబాబు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలోని హోంగార్డుల సమస్యల పరిష్కారానికి పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం 'వెల్ఫేర్ మీటింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో హోంగార్డుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరణించిన/ ఉద్యోగ విరమణ చేసిన వాటికి ఇచ్చే వన్డే కాంట్రిబ్యూషన్ రూ.5లక్షల నుండి రూ.7 లక్షలకు పెంచాలని కోరగా, త్వరగా చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోంగార్డులు ఎక్కడ నివాసం ఉంటున్నారో వారికి దగ్గరలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వధాప్య పెన్షన్, పిల్లల చదువుల నిమిత్తం విద్యాదీవెన తదితర ప్రభుత్వ పథకాలు వచ్చేలా ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధమయ్యే హోంగార్డులకు ఉచిత శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని సిపి తెలిపారు. ఈసందర్భంగా సిపి మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు వ్యవస్థలో భాగమన్నారు. వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమీ షాలి, కష్ణ మూర్తి నాయుడు, హోంగార్డ్స్ కమాండెంట్ టి.ఆనంద బాబు, హోంగార్డ్సు డిఎస్‌పి కె.వి.ఎస్. ఎన్.పరమేశ్వర రావు, హోంగార్డ్స్ ఆర్ఐ సుధాకర్ రెడ్డి, సుమారు 200 మంది హోంగార్డులు పాల్గొన్నారు.

నేడు హోంగార్డుల దినోత్సవం

సిటీ అర్మడ్ రిజర్వ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 7 గంటలకు హోంగార్డ్స్ రైజింగ్ డే -2024 వేడుకలు జరుగుతాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ముఖ్య అతిధిగా పాల్గొంటారు.

టాలీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని 'ఫెడరల్ స్కిల్ అకాడమీ' ట్రైనింగ్ సెంటర్‌లో 'టాలీ' కోర్సుపై సర్టిఫికెట్‌తో కూడిన ఉచిత శిక్షణతోపాటు ఖచ్చితమైన ఉద్యోగావకాశాలకు సంబంధించి అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు తెలిపారు. ఈ శిక్షణలకు బి.కామ్, బీఎ, బీబీఏ, ఎమ్.కామ్ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 9న శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కానూరులోని తులసినగర్‌లో గల "ఫెడరల్ స్కిల్ అకాడమీ" ట్రైనింగ్ సెంటర్‌కు విద్యార్హత ధృవపత్రాలతోపాటు, ఆధార్ కాపీ, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని, వివరాలకు 87146 92747 నంబరులో సంప్రదించాలని సూచించారు.



కమ్యూనిజం ప్రత్యేక సంచికను ఆవిష్కరణలో ఈడ్పుగంటి నాగేశ్వరరావు, జల్లి విల్సన్, చలసాని వెంకట రామారావు తదితరులు

'కమ్యూనిజం' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రపంచ వ్యాప్తంగా కొత్త రకం ఫాసిజం ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలను ఆకలి, దారిద్ర్యం, నిరక్ష్యరాస్యతల నుంచి బయటపడేయటానికి అవసరమైన కమ్యూనిజం భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కమ్యూనిజం పత్రిక మాజీ సంపాదకులు, సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఐ స్థాపించి వందేళ్లు, పార్టీ సైద్ధాంతిక పత్రిక 'కమ్యూనిజం' ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కమ్యూనిస్టు ఉద్యమం, చరిత్ర, పోరాటాలు, వివిధ అంశాలతో రూపొందించిన'కమ్యూనిజం' ప్రత్యేక సంచికను ఆయన గురువారం ఆవిష్కరించారు. విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక చంద్రం బిల్డింగ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కమ్యూనిజం పత్రిక సంపాదకులు చలసాని వెంకట రామారావు, సంపాదకవర్గ సభ్యుడు ఎంసీ వెంకటేశ్వర్లు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టీ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ గురువారం ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, వీఆర్వోలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో రెవెన్యూ సదస్సులు, మెగా పేరెంట్స్ డే కార్యక్రమాల నిర్వహణపై మార్గ నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో భూ సమస్యలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వచ్చే అవకాశం ఉన్నందున హెల్ప్ డెస్క్ మాదిరిగా అర్జీల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిజికల్గా రసీదు ఇవ్వాలన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహణకు ఎంఈఓలు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు కలిసి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సింగిల్ టీచర్స్ పాఠశాలలకు తగిన సహకారం అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్ అందించాలన్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల చదువు పరిస్థితి వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన బ్యాక్ డ్రాప్ మాత్రమే వినియోగించాలని, ఎవరి ఫొటోస్ ఉండరాదని సూచించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నిర్వహణ సంబంధిత ప్రొఫార్మాలు అన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు. రెండు రోజుల ముందుగానే గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా, లోకల్ మీడియాలో ప్రచారం నిర్వహించాలన్నారు. ఆ గ్రామానికి సంబంధించి ఎన్ని అర్జీలు వస్తాయో తగిన సంఖ్యలో దరఖాస్తులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సర్వీసెస్ లేదా గ్రీవెన్స్ పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ సందర్భంగా గ్రామ సభ వద్ద గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది కౌంటర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రీవెన్స్ పిజిఆర్ఎస్ పోర్టల్ లో రెవెన్యూ సదస్సుల మెనూలో నమోదు చేయాలన్నారు. గ్రామసభల వద్ద తాగునీరు, టెంట్స్ వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. వీఆర్వోలను ఎడ్యుకేట్ చేయాలన్నారు. వాటర్ టాక్స్ డిమాండ్ రిజిస్టర్, లేటెస్ట్ అడంగల్, కూడా సంబంధిత రికార్డులు సిద్ధంగా ఉంచాలన్నారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ముగిసినప్పటికీ ఇందులో వచ్చిన అర్జీలు పరిష్కారం అయ్యేదాకా ఫాలో అప్ చేయాలన్నారు. ట్రూ స్పిరిట్ తో కార్యక్రమాలు జరిగేలా నిర్వహించాలన్నారు. జిల్లాలో 497 పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. పెద్ద పంచాయతీలలో రెండవ రోజు కూడా నిర్వహించవచ్చన్నారు. సదస్సులలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.

అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో

స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం

మున్సిపల్ పాఠశాలల్లో విస్తృతంగా సదస్సులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరావతి బాలోత్సవం ఆధ్వర్యాన నవంబరు 25 నుండి పది రోజులపాటు హైస్కూల్ స్థాయిలో 'గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్'పై సదస్సులు నిర్వహించినట్లు అమరావతి బాలోత్సవం కార్యదర్శి పి.ఐజాక్ న్యూటన్ తెలిపారు. లైంగిక వేధింపుల నుండి స్త్రీ రక్షణ పొందే మార్గాలపై విద్యార్థునులను చైతన్య పరిచారు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఉన్నత చదువులు చదివిన రిసోర్స్ పర్సన్స్‌గా కె.స్వరూపరాణి, బండి స్వాతి, దుర్గాభవాని, దుర్గాంభిక, ప్రసన్న, పావని వివిధ ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్లలో 6 వేల మంది విద్యార్థినులకు పోర్నోగ్రఫి, పోక్సో చట్టాల గురించి వివరించారు. సోషల్ మీడియా యాప్స్ ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహించిన అమరావతి బాలోత్సవాన్ని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.



ఎన్నో విషయాలను చెప్పినందుకు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే కొత్తగా వచ్చిన రిసోర్స్ పర్సన్స్‌కు ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. ఎస్‌విఆర్‌ఎంసి, వివిఎంఆర్‌ఎంసి, ఎపిఆర్‌ఎంసి, బిఎస్‌ఆర్‌కెఎంసి, బిషప్ అజరయ్య గర్ల్స్, ఎస్‌కెఆర్‌ఎంఆర్‌ఎంసి, కెబిసిజడ్‌పిహెచ్ బాయ్స్, జిడిఇటిఎంసి, కెఎస్‌ఆర్ గర్ల్స్, ఎంఎఎంసి ఉర్దూ, పిఎస్‌ఎంసి గర్ల్స్, అన్నపూర్ణాదేవి ఎంసి, జిఎన్‌ఆర్‌ఎంసి, డిఎస్‌సిఎంసి, ఎకెటిపిఎంసి పాఠశాలల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆరు వేల మందికిపైగా విద్యార్థునులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఆర్‌ఎస్‌కె సిబ్బంది సర్దుబాటు

ప్రయోగాలు, పొలం బడి, రైతులు ధాన్యం విక్రయాలను ఆన్‌లైన్ చేయడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలను గుర్తించడం తదితర సేవలు అందిస్తున్నారు.

క్రమబద్ధీకరణపై నివేదికలు

వ్యవసాయ, అనుబంధ రంగాలకు సేవలందించే ఆర్‌ఎస్‌కెలను, విఎఎ పోస్టులను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయడం సమస్యగా మారింది. జిల్లాలో 1676 ఎకరాలకు సగటున ఒక విఎఎ పోస్టును కేటాయించారు. అయితే బందరు మండలంలో అత్యల్పంగా 309 ఎకరాల విస్తీర్ణానికి గుండుపాలెంలో, 289 ఎకరాల విస్తీర్ణానికి కరగ్రహారంలో ఆర్‌ఎస్‌కెలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా 4,287 ఎకరాలకు నాగాయలంక మండలం తలగడదీవి ఆర్‌బికెలో, 4,215 ఎకరాలకు పెదపారుపూడి మండలం యలమర్రులో ఆర్‌ఎస్‌కె సేవలందించాల్సి వస్తోంది. ఈ హెచ్చుతగ్గులను సవరించి ఒక్కో ఆర్‌ఎస్‌కె పరిధిలో 1000 నుంచి 1500 ఎకరాల వ్యవసాయ భూముల విస్తీర్ణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

శాఖల పరిధిలోకి సిబ్బంది

వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ సహాయకులు గ్రామ కార్యదర్శి పర్యవేక్షణలో పనిచేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు లాగిన్ ద్వారానే వేతనాలు, సెలవులు మంజూరు ప్రక్రియలు సాగుతున్నాయి. వీరికి బాధ్యతలు కేటాయించే క్రమంలో గ్రామ సెకటరీ, ఆయాశాఖల అధికారులకు మధ్య సమన్వయం లోపిస్తోంది. క్రమబద్ధీకరణలో భాగంగా వారిని ఆయా శాఖల పరిధిలోని అధికారుల పర్యవేక్షణలోకి తీసుకు రానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గతంలో ఆర్‌ఎస్‌కెల్లో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న 42 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

ఎన్‌టిఆర్ జిల్లాలో 157 ఎన్‌ఆర్‌కెలు

కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని సూచిస్తున్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్-7702203571లో సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలుకు ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా జిల్లాలోని ఆర్‌డిఒలకు, తహశీల్దార్లకు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శుక్రవారం 6 డిసెంబర్ 2024

గుర్రపుడెక్క కళాకృతులకు ప్రోత్సాహం : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కాలువలు, చెరువుల్లో పెరిగే నాచురకం మొక్క గుర్రపుడెక్కతో తయారైన కళాకతులకు ప్రోత్సాహం అందిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మండల సమైక్య సభ్యులకు భరోసా కల్పించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్లో లేపాక్షి, ఆప్కో స్టోర్ ప్రతినిధులు, మచిలీపట్నం మండల సమైక్య సభ్యులతో సమావేశమై గుర్రపుడెక్కతో చేస్తున్న వస్తువుల తయారీ, వాటి మార్కెటింగ్‌పై వారితో చర్చించారు. ఈ క్రమంలో ఆయన వారు తయారు చేసిన వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇది మంచి ఉపాధిని కల్పిస్తుందని, దీనిపై ఇప్పటికే నిపుణులైన వారితో శిక్షణ ఇప్పించామన్నారు. దీనిపై మరింత మందికి శిక్షణ ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ అధికారులకు సూచించారు. వస్తువుల తయారీకి అవసరమైన ముడి సరుకు (గుర్రపుడెక్క)కు కొదవలేదని, దాని సరఫరాకు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు.పర్యావరణ అనుకూలమైన వస్తువులకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఆ అవకాశాలను అందిపుచ్చుకొని ఎదగాలని ఆశించారు. వచ్చే సమావేశం నాటికి వారు తయారుచేసిన వస్తువులకు ధరలను నిర్ణయించటం, మార్కెటింగ్ కోసం ఆకట్టుకునే విధంగా ఒక పేరును (బ్రాండ్ నేమ్) ఆలోచించాలని మండల సమైక్య సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ డిపిఎం సుధాకర్, లేపాక్షి సంస్థ ఎండి విశ్వ, ఆప్కో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మచిలీపట్నం మండల సమైక్య మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం ధ్వంసంపై ఆందోళన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామంలోని స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న విగ్రహం, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన బ్యానర్లపై గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి బురద చల్లి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకొని గురువారం ఉదయం సంఘటన స్థలానికి వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘీయులు, డీసి చైర్మన్ మట్టా ప్రసాద్, ఎయిర్ పోర్ట్ అభివద్ధి కమిటీ సభ్యులు తులసి మండల టిడిపి పార్టీ నాయకులు సుబ్రమణ్యం, చిట్టిబాబు, ఈడే కష్ణ ఈడే మోహన్‌లు చేరుకొని లచ్చన్న విగ్రహాన్ని శుద్ధి తరచి పాలాభిషేకం చేశారు. గుడివాడ రూరల్ సిఐ సోమేశ్వరరావు, ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి, సమీపంలో ఉన్న సిసి కెమెరాల ద్వారా వివిధ కోణాల ద్వారా గుర్తించి సంఘటనకు పాల్పడిన దుండగులను అరెస్ట్ చేస్తామని తెలిపారు. అలాగే పెద్ద హరిజనవాడలో టిడిపి నాయకుడు కంచర్ల ప్రకాష్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాము జన్మదిన శుభాకాంక్షల బ్యానర్ను ధ్వంసం చేశారు.


షోరూం ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత

షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : మహిళా స్వావలంభనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని హోంమంత్రి వంగల పూడి అనిత అన్నారు. స్థానిక వెంకటేశ్వరటాకీస్ సమీపాన ఉషా డిజైనర్స్ షోరూం ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలసి గురువారం ప్రారంభించారు. ప్రస్తుత రోజుల్లో డిజైనింగ్ కు మంచి డిమాండ్ ఉందన్నారు. డిజైనింగ్, అల్లికలు వంటి చేతి పనులలో మహిళలు శిక్షణ పొంది ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, దండమూడి కిషోర్, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ గుడివాడ శేషుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులతోపాటు రక్తదాతలుగా పాల్గొనేవారు పేర్లు నమోదు చేయించుకునేవారు తమ మొబైల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు. రెడ్ ట్రస్ట్ సొసైటీ సభ్యులు వెంకటేశ్వరరావు సెల్ నెంబర్ 90305 4949, గరికపాటి హరిప్రసాద్ 95027 89619, ఆది రామ్మోహన్రావు 99493 69521 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని శేషుబాబు తెలిపారు.

పంటల్లో ఎలుకల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మోపిదేవి : రైతులు పండించిన పంట రక్షించుకోవడంలో ఎరుకల నివారణపై ఆధారపడి ఉంటుందనీ వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బందం గురువారం మోపిదేవి మండలంలో పర్యటించి మెరకనపల్లె గ్రామంలో కేవీకే సమన్వయ కర్త అధ్యక్షతన సస్యరక్షణ శాస్త్రవేత్త డా రేవతి వివిధ పంటలలో సామూహిక ఎలుకల నివారణ పై అవగాహణ సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. సుధా రాణి మాట్లాడుతూ ఎలుకలు అన్ని పంటలలో నష్టాన్ని కలుగచేస్తున్నాయని వీటి నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని బ్రమోడయాలోన్ విషపు ఎరను తయారు చేసుకుని పొలంలో పెట్టుకోవాలని వివరించారు. మినుములో ట్రైకోడెర్మ వంటి జీవ శిలీంద్ర నాశిని తో విత్తన శుద్ధి చేసుకుని కాండం గజ్జి తెగులు ఉధతి తగ్గించుకోవచ్చు అని తెలియచేశారు. అవగాహన అనంతరం బ్రమోడయాలోన్ విషపు ఎర తయారి విధానాన్ని, పాటించాల్సిన మెళకువలను నైపుణ్యత ప్రదర్శన ద్వారా రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కెవికే సిబ్బంది సస్యపోషణ శాస్త్రవేత్త డా. వెంకటలక్ష్మి, విస్తరణ శాస్త్రవేత్త డా.నవీన్, సహకార సంఘ ఇన్చార్జి లీల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక సాయం అందజేత


ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : జాతీయస్థాయి స్కే పోటీలలో పాల్గొనే విద్యార్థులకు రావెళ్ల కష్ణ సేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ రూ.10వేల ప్రోత్సాహక సహాయాన్ని అందచేశారు. చల్లపల్లిలోని వివిధ ప్రవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న సుబ్బు తైక్వాండో అకాడమీ విద్యార్థులు 15 మంది హరియానాలో మూడు రోజులపాటు జరిగే జాతీయస్థాయి స్కే పోటీలకు ఎంపికయ్యారు. శ్రీచైతన్య విద్యార్థులకు రవాణా, ఇతర ఖర్చుల కోసం రావెళ్ల కష్ణ సేవాసమితి ద్వారా ప్రోత్సాహక నగదును సేవాసమితి అధ్యక్షులు నిడమానూరి దిలీప్ కుమార్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ గురువారం అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ నబీఘోరి, టీడీపీ నేతలు తాతా ప్రదీప్, మేడికొండ రవిబాబు, కోచ్ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి : సిఐ



ప్రజాశక్తి-చల్లపల్లి : రాత్రి వేళ పకడ్బందీగా గస్తీ నిర్వహిస్తున్నట్లు చల్లపల్లి సిఐ కె. ఈశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ నైట్ రౌండ్స్ అధికారులు నిరంతరం బీట్ పాయింట్లను తనిఖీ చేస్తూ, ప్రార్థన మందిరాలు, ఏటిఎంలు, ఇతర ముఖ్య వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని అని వివరించారు. నేరాలను నివారించేందుకు ఈ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా అనుమానాస్పద వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సుబ్బారెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్ర ప్రజానాట్య మండలి నేత గాదె సుబ్బారెడ్డి ఆకస్మిక మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పలువురు ప్రజాసంఘాల నాయకులు నివాళు లర్పించారు. గురువారం గుడివాడ పట్టణంలోని సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అధ్యక్షతన సంతాప సభ జరిగింది. ఈ సంతాప సభలో పలువురు ప్రజా సంఘాల నాయకులు సుబ్బారెడ్డి చేసిన కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీ కష్ణా రెడ్డి, ప్రజా నాట్య మండలి నాయకులు పి.ప్రభు దాసు, పి.వీరమ్మ, సుబ్బారెడ్డి అభిమాని ఏ.శ్రీనివాసు, మహిళా సంఘం పట్టణ కార్యదర్శి పి.రజని, కోటేశ్వరరావు, వెంకట రావు, రాధాకష్ణ, సురేంద్ర, విజయ్ కుమార్, ఎస్సయ్య, కొండా, తదితరులు పాల్గొన్నారు.


సంతాప సభలో మాట్లాడుతున్న శ్రీనివాసు

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

- సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకష్ణయ్య

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంతర్జాతీయ సమాఖ్య ప్రపంచ దేశాలన్నింటిలో వికలాంగుల సమస్యల గురించి పోరాటం చేస్తూ ఏర్పరచిన కన్వెన్షన్లో భారతదేశం కూడా సంతకం చేసి అందులో రూపొందించిన నియమావళి ప్రకారం వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. అంతర్జాతీయ వికలాం గుల దినోత్సవాన్ని పురస్కరించు కుని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి వి. హేమలత అధ్యక్షతన అవగాహన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.వి. రామకష్ణయ్య మాట్లాడుతూ వికలాంగులను సమాజంలోని మిగిలిన వారితో సమాన హోదాతో చూడాలన్నారు. చట్టంపై అవగాహన పెంచుకుని హక్కులను సాధించుకోవాలని సూచించారు. వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. కామరాజు మాట్లా డుతూ దివ్యాంగులకు కావసిన ఉపకరణాలు పొందుటకు పేపర్ ప్రకటన ఇచ్చామని అవసరమైన ధవీకరణ పత్రాలు సిద్ధంచేసుకుని సకాలంలో ఆన్లైన్లో అప్లికేషన్స్ పెట్టుకుని లబ్ధి పొందాలన్నారు. మాజీ ప్రభుత్వ న్యాయవాది అజ్మతున్నీసా, రాబర్ట్ సన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. ఏసుబాబు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝూన్సీ లక్ష్మి, ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి ఎన్ ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వికలాంగులకు వీల్‌చైర్‌ను, ఇద్దరికి హియరింగ్ పాడ్స, చదువుకునే 10 మంది వికలాంగ విద్యార్థులకు బహుమతులను సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకష్ణయ్య చేతుల మీదుగా అందజేశారు.



నివాస ప్రాంతంలో మద్యం దుకాణం వద్దు

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక ప్రాంతంలోని సత్యంగారి హోటల్ సెంటర్ వద్ద ప్రజల నివాస ప్రాంతంలో మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరించి వాటిని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటూ హైవేకు 20 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఏర్పాటు తగదన్నారు. గతంలో ఏర్పాటుకు ప్రయత్నం చేసిన వెంకటేశ్వర వైన్స్, కీర్తి వైన్స్ షాపులను స్థానిక ప్రజలు వ్యతిరేకించడంతో తొలగించిన పరిస్థితులు ఉన్నాయన్నారు. స్థానికుల అభీష్టానికి వ్యతిరేకంగా మద్యం దుకాణం ఏర్పాటు తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, మహిళా నాయకులు కె.కుమారి, దమయంతి, తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు ఎడిసిపి ట్రాఫిక్ ప్రసన్న కుమార్, ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వరరావు, నందిగామ ట్రాఫిక్ సిఐ సతీష్ పర్యవేక్షణలో బుధవారం పట్టణ పరిధిలోని స్థానిక వాహనాలను తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులను తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ ఎస్ఐ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించి, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని మరియు నెంబర్ ప్లేట్ లేని వెహికల్స్ సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరావు, హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది వెంకటేశ్వరరావు, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

గాంధేయవాదులు ఏకం కావాలి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గాంధేయవాదులు ఏకం కావాలని, వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు నీలం రాంబాబు నాయడు, జాతీయ అధ్యక్షుడు చందన్ పాల్, మేనేజింగ్ ట్రస్టీ షేక్. హుస్సేన్ అన్నారు. గురువారం విజయవాడ జింఖాన గ్రౌండ్‌లో ఏపీ సర్వోదయ మండల్ ఆధ్వర్యంలో సామాజిక సత్యా గ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారణాసి(కాశీ)లో 1948లో సర్వ సేవా సంఘ్ 12.89 ఎకరాల సొంత స్థలం కొనుగోలు చేసిందన్నారు. ఆ స్థలంలో మహనీయులు మధుర జ్ఞాపకాలతో కూడిన గాంధీ సామాజిక సేవా కుటీర సముదాయాలు(సర్వ సేవా సంఘ్ కాంప్లెక్స్) సుమారు 42 పురాతన కట్టడాలను, మహనీయుల జ్ఞాపకాలను ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కూల్చివేసి, ఆ స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఈ ఘటనను ప్రతిఘటిస్తూ దేశ వ్యాప్తంగా గాంధేయ వాదులంతా ఏకమై సత్యా గ్రహ దీక్ష చేస్తున్నారని తెలిపారు. వారణాసి లో 100 రోజుల సత్యా గ్రహ దీక్షలు జరుగుతున్నాయని, దీనిలో భాగంగానే విజయవాడ జింఖాన గ్రౌండ్ లో ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఒక రోజు దీక్ష చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల గాంధేయవాదులు తదితరులు పాల్గొన్నారు.



హామీల అమల్లో మాట తప్పిన ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి-గంపలగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమల్లో విఫలమైందని ఎన్టీఆర్ జిల్లా సిపిఎం కార్యదర్శి డి.వి.కృష్ణ విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మల్లవరపు కుటుంబరావు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతుల విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే దానిపై అదానిపీతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అప్పటి పరిస్థితుల్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్‌లు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి అధికారులు వస్తే మీటర్లను పగలగొట్టండని బహిరంగంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయమని, కరెంటు ఛార్జీలు పెంచమని హామీనిచ్చారన్నారు. నేడు అందుకు భిన్నంగా బడ్జెట్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకై రూ.2500 కోట్లు నిధులు కేటాయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్థానిక కట్టలేరు వంతెన ధ్వంసమై ఆరు సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. 25 గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఆ



గంపలగూడెంలో మాట్లాడుతున్న డివి కృష్ణ

వంతెనను వెంటనే నిధులు కేటాయించి నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల వీరాంజనేయులు, మేకల నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి, గుంటుపల్లి వీరభద్రం, మద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, మీసాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తిరువూరు: జనవరి 3, 4, 5 తేదీల్లో తిరువూరులో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభల ఏర్పాట్లను గురువారం డి.వి.కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా 25వ జిల్లా మహాసభల ప్రచార బ్యానర్లను ప్రారంభించారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 3వ తేదీన భారీ ప్రదర్శన, 4, 5 తేదీలలో ప్రతినిధుల సభ జరుగుతుందని, ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వంలో నిత్యావసర ధరలతో పాటు ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను మోపి సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిస్తే అదే బాటలో కూటమి ప్రభుత్వం నడుస్తుందని ఎద్దేవా చేశారు. ఆనాడు నిర్వహించిన బాధుడే బాధుడు నేడు అధికారంలోకి వచ్చిన కూటమికి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ ఆదేశాలతో ఆనాడు జగన్ ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడుతుంటే వాటిని పగలగొట్టమని ప్రజలకు పిలుపునిచ్చిన నారా లోకేష్ నేడు ఆయన ప్రభుత్వమే ఆ మీటర్లు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి ఎం.నాగేంద్ర పసాద్, నాయకులు ఆకుల రవి, కె.విరత్నం తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



ప్రజాశక్తి-కంచికచర్ల: సిసిఐ కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల మార్కెట్ యార్డులో సిసిఐ పత్తి కొనుగోళ్లను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెట్టవద్దని సీసిఐ బయ్యర్ నాయక్ కు సూచించారు. ఇటీవల నందిగామలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించినా , రైతులకు ప్రయోజనం చేకూరలేదని, రైతులు పండించిన పత్తిని నేరుగా గుంటూరుకు తీసుకురావాలని బయ్యర్లు ఇబ్బందులు పెట్టారని పలువురు ఆమె దష్టికి తెచ్చారు. దీనెపై స్పందించిన ఆమె ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారుల దష్టికి తీసుకెల్లినట్లు తెలిపారు. కచ్చితంగా మార్కెట్ యార్డులో సిసిఐ కేంద్రానికి రైతులు తీసుకు వచ్చిన పత్తిని పరిశీలించి, కొనుగోలు చేసి క్వింటాకు మద్దతు ధర 7521 చెల్లించాలని బయ్యర్ కు సూచించారు. రైతులు కూడా తేమ శాతం ఎక్కుల లేకుండా, ఇల్ల వద్దనే శుభ్రం చేసిన పత్తిని సిసిఐ కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, ఏఎంసి మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారారణ, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక , తహశీల్దార్ జాహ్నవి పాల్గొన్నారు.



పామాయిల్ సాగు లాభదాయకం : అహ్మద్

ప్రజాశక్తి-తిరువూరు: దీర్ఘకాలం అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని తిరువూరు ఉద్యానవన అధికారి సోహెల్ అహ్మద్ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో గురువారం పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పతాంజలి ఫుడ్స్ సహకారం తో ఉద్యానవన శాఖ ఆయిల్ ఫామ్ మొక్కలను ఔత్సాహిక రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారని, సాగు ఖర్చుల నిమిత్తం ఏడాదికి హెక్టారుకు రూ.5250 చొప్పున రాయితీ కల్పిస్తామన్నారు. పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగు కూడా రాయితీ వర్తిస్తుందన్నారు. సూక్ష్మ సేద్యం పథకంలో ఉద్యానవన పంటలకు, మొక్క జొన్నకు 5 ఎకరాల లోపు 90శాతం రాయితీ,5 ఎకరాల పైన సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజే స్తామన్నారు. ఆరుతడి పంటలైన అపరాల్లో 50 శాతం రాయితీతో స్ప్రికర్లను అందజేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విస్సన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులకు మద్దతుగా



ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం విస్సన్నపేట గురుకుల పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విస్సన్నపేట నాయకులు ఎం.విశాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయ సమస్యలు పట్టడంలేదన్నారు. కనీసం జీతం ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. రెగ్యులర్ చేస్తామన్న మాటకు ఇప్పటికీ సమాధానం లేదన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ ఆందోళనకు సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ట్రోఫీల ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

నాదెళ్ల బసవపూర్ణయ్య స్మారక అఖిల భారత ఆహ్వాన వాలీబాల్ టోర్నమెంట్ ట్రోఫీలను వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి వెంకటేశ్వరరావు కానూరులోని యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. నాదెళ్ల బసవపూర్ణయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుంచి 15 వరకు నూతనంగా నిర్మించిన విఆర్ సిద్ధార్థ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు నాదెళ్ల బ్రహ్మజీరావు తన తండ్రి బసవపూర్ణయ్య స్మారకార్థం టోర్నీ నిర్వహించడం అభినందనీయ మన్నారు. నూతనంగా నిర్మించిన వీఆర్ సిద్ధార్థ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు ఈ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబడిందని, ఇందులో వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, స్క్వాష్ మరియు ఇతర 14 క్రీడా విభాగాలను ఆడటానికి ఉపయోగించబడుతుందని ఆయన చెప్పారు. టోర్నమెంట్ ఆర్గనైజర్, నాదెళ్ల బసవపూర్ణయ్య ట్రస్ట్ ట్రస్టీ బ్రహ్మజీరావు మాట్లాడుతూ ఆరు ఉత్తమ మహిళా జట్లు దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్), సెంట్రల్ రైల్వే (ముంబై), దక్షిణ రైల్వే (చెన్నై), గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్, చెన్నై), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (పుణె) జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, సిద్ధార్థ



అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఇతర ప్రముఖులు టోర్నీని ప్రారంభిస్తారని తెలిపారు. మొత్తం ప్రైజ్ మనీ రూ.2.75 లక్షలు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్శిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ పాండు రంగారావు, ఫిజికల్ డైరెక్టర్ రఘు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దోనేపూడి దయాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

- ఎకరాకు 3 నుంచి 5 బస్తాల వరకూ నష్టం
- గిట్టుబాటు ధర ఇవ్వాలని వినతి



ప్రజాశక్తి-గన్నవరం : తుపాను దెబ్బకు అన్నదాతలు కుదేలయ్యారు. నిన్నటి వరకూ గోనెసంచుల లభ్యత లేకపోవటం, రవాణా సదుపాయం కల్పన అంతం తమాత్రంగా ఉండటంతో ధాన్యం విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన మోస్తరు వర్షానికే కోసి ఉన్న ధాన్యం మొలకెత్తింది. ఎకరాకు 3 నుంచి 5 బస్తాల వరకూ ధాన్యం మొలకెత్తడటంతో ఏర్పడిన నష్టాన్ని చూసి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, విజయవాడ రూరల్ ఉంగుటూరు, మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 54,960 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇప్పటికే 18,065 టన్నులు ధాన్యం మిల్లులకు తర లించారు. కల్లాలు, రోడ్లపై కోత కోసిన ధాన్యం 14 వేల టన్నుల వరకు నిల్వ ఉంది. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. ఈ ధాన్యం ఆయా మండలాల్లో రోడ్లపై రాశులు, కాటాలు వేసి బస్తాలను భద్రపరిచారు.

వాతావరణంతో ఆందోళన...

తుపాను ప్రభావంతో ఆకాశంలో మబ్బులు పట్టడంతో నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశం పూర్తిగా మేఘావతమై కారుమబ్బులు కమ్మింది. మోస్తరు నుంచి తీవ్రమైన చలిగాలులు వీస్తు న్నాయి. దీనికి తోడు రెండు రోజులు మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిశాయి. రాశులు, బస్తాలకెత్తిన ధాన్యం వర్షం బారిన పడకుండా పరదాలు, టార్పాలిన్లు కప్పి సంరక్షించారు. అయితే గాలులు తీవ్ర, వర్షం కార ణంగా రాశులు అడుగు భాగంలో ఉన్న ధాన్యంలో మొలకలు పలు గ్రామాల్లో సమస్య తలెత్తింది. ఎకరాకు ఐదు బస్తాల వరకూ ధాన్యం నష్టం జరిగినట్లు అంచనా. ఇప్పటికే తేమ శాతం 22 నుంచి 24 వరకూ ఉండ టంతో మిల్లర్లు 75 కిలోలు బస్తా ధాన్యం రూ.1400 మించి ధర పెట్టడం లేదు. దీని వల్లే రూ.300 నుంచి రూ.400 వరకూ రైతులు ఆర్థికంగా నష్టపోయారు. తాజాగా ధాన్యం మొలకెత్తటంతో ధాన్యం సేకరణ చేసేందుకు మిల్లర్లు మరింత వెను కాడుతున్నారు. ధాన్యం నాణ్యత దెబ్బతిని మిల్లింగ్ సమయంలో నూక అయ్యే పరిస్థితి ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీని వల్ల బస్తాకు ఎంత ధర నిర్ణయం చేస్తారో కూడా అర్థం కాని పరిస్థితి గ్రామాల్లో నెలకొంది.

గిట్టుబాటు ధర ఇవ్వాలని వినతి...

రాశులు రోడ్లపై నిల్వ చేశారు. ప్రైవేటు రవాణా వాహనాలను సమద్ధిగా సమకూర్చి ధాన్యాన్ని మిల్లులకు తరలించి ఉంటే ఈ రోజు ధాన్యం మొల కెత్తే పరిస్థితి ఉండేది కాదు. అయితే రవాణా వాహనాలను సమకూర్చటంలో అధికారులు తాత్సారం చేయటంతోనే ధాన్యం మొలకెత్తి, ఎక రాకు మూడు బస్తాల వరకూ నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. రైతుల ఇబ్బందులు, ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని మద్దతు ధరకు ధాన్యం సేకరించి తమకు భరోసా కల్పించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



మృతి చెందిన ఆశావర్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆశా వర్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ

ప్రజాశక్తి - గుడివాడ : మృతి చెందిన ఆశా వర్కర్ వీర కుమారి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని (సిఐటియు) ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ డిమాండ్ చేశారు. గురువారం గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఆశా వర్కర్ వీరకుమారి మృతి చెందారు. ఈ సందర్భంగా ధనశ్రీ మాట్లాడుతూ 17 సంవత్సరాల నుంచి ఆశా వర్కర్ గా పని చేస్తున్న వీరకుమారి గుండె పోటుతో మృతి చెందిందన్నారు. మట్టి ఖర్చులు ప్రభుత్వం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆశా వర్కర్‌లు సిహెచ్ చందన లక్ష్మి, ఎం మనీ, సిహెచ్ లత, నీలిమ, కే నాగలక్ష్మి, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ డే : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ప్రతి పాఠశాలలో ఈనెల 7వ తేదీ మెగా పేరెంట్స్ డే నిర్వహిం చనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్ మీకోసం హాలులో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 1363 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించుటకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్, అంటే విద్యార్థి ఏ సబ్జెక్టులో బాగా చదువుతున్నది, ఏ సబ్జెక్టులో వెనుకబడింది విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించడానికి ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. తద్వారా విద్యార్థుల విద్యాభివద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. మెగా పేరెంట్స్‌డే సమావేశాలకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పటికే ఆహ్వానం పంపామని, వారి మొబైల్‌కి ఎస్ఎంఎస్ ద్వారా కూడా తెలియజేశా మన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తొలుత రాష్ట్ర మానవ వనరుల అభివద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా కలెక్టర్ జిల్లాలో మెగా పేరెంట్స్ డే నిర్వహణ ఏర్పాట్లపై వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు పాల్గొన్నారు .

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు



గుడివాడలో మట్టి నామూనా పత్రాలను అందజేస్తున్న దృశ్యం



పమిడిముక్కల మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గుడివాడ : మట్టిని కాపాడుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రసాయినిక ఎరువులతో భూసారం తగ్గిపోతుందని ఎడిఎ ఎన్ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మీలు అన్నారు. గురువారం గుడివాడ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలతో పాటు నాగరప్పాడులోని రైతు సేవా కేంద్రంలో ప్రపంచ మట్టి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందరర్భంగా వారు మాట్లాడుతూ సహజమైన వనరు నేల అన్నారు. గత దశాబ్దాలుగా నేల ఆరోగ్యం క్షీణించుకు పోతుం దన్నారు. సేంద్రీయ ఎరువులను వినియోగిం చుకుని అత్యధిక దిగుబడులను పొందాలన్నారు. మట్టిని మెరుగుపరచడానికి మనం ప్రయత్నం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మట్టి నమూనా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పమిడిముక్కల : భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని తెలుసుకొని రైతులు మంచి దిగుబడులు పొందాలని గన్నవరం వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని మంటాడ రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవ సందర్భంగా రైతులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేలను భద్రంగా చూసుకోవాలని, సహజ ఎరువులు ఎక్కువగా వేయాలని అన్నారు. వరి, చెరకు, మొక్కజొన్న, పసుపు పంటలకు భూసార పరీక్షలు ఎంతో మేలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రైతులు అత్యధికంగా రసాయన ఎరువులను వాడి భూసారాన్ని నాశనం చేసుకోకూడదని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని మచిలీపట్నం మండలం సుల్తా నగరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన రైతులకు భూసార పరీక్షలు చేసిన కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని రైతుల పొలాలలో భూసారాన్ని పరీక్షించి దానికి అనుగుణంగా సేంద్రియ ఎరువులను వినియోగించి అత్యధిక దిగుబడులను పొందుకోవాలని ఆయన సూచించారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ 2024 మార్చిలో ద స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వెబ్సైట్లో రిజిస్టర్ అయిన విద్యార్థులకు నవంబర్ 12 వ తేదీన పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ మచిలీపట్నంలో భూసార పరీక్షల పై అవగాహన శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు సుల్తానగరంలో 50 మట్టి నమూనాలు సేకరించా రన్నారు. ఆ 50 మట్టి నమూనాలు కె.వి సైన్స్ ల్యాబ్ లో పరీక్షించిన అనంతరం సుల్తానగరంలో గ్రామ సభలో రైతులకు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హారిక, ప్రోగ్రామ్ ఇన్చార్జి కే సాహిత్య, పిజిటి కిషోర్ కుమార్ గుప్తా, మట్టి నమూనాలు సేకరించిన విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా జంప్ రోప్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : నియోజకవర్గంలోని గన్నవరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం కృష్ణాజిల్లా జంప్ రోప్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించినట్లు జంప్ రోప్ సంఘ అధ్యక్షులు నాగ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా నాగప్రసాద్ మాట్లాడుతూ తాడాట ఆడటం వలన విద్యార్థులకు ఎన్నో రకాలైన ఉపయోగాలు ఉన్నాయని, శారీరకంగా అందరూ మానసికంగా బలంగా గాను ఉంటారని అన్నారు. ఇక్కడ ఎంపికైనా క్రీడాకారులు డిసెంబర్ 14, 15 తేదీలలో అన్నమయ్య జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, కష్ణ ప్రియా, మీరా సాహెబ్, గీత, విజయ్కుమార్ గోగులముడి పాల్గొన్నారు.

నేడు పాపారావు అభినందన సభ



చిలకలపూడి పాపారావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావు అభినందన సభ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అవనిగడ్డ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షత న జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావుల తోపాటు జిల్లాలోని శాసనసభ్యులు ప్రముఖ రాజకీయ నాయకులు బీసీ సంఘాల నాయకులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి తెలిపారు.

ప్రత్యేక జూరీ అవార్డుకు 'కొమ్మారెడ్డి' పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి-బంటుమిల్లి : అత్యంత వెనుకబడ్డ మారుమూల గ్రామీణ ప్రాంతంలో విద్యాభివద్ధిని ప్రోత్సహిస్తూ వేల మంది విద్యార్థులను దేశ భావి పౌరులుగా తయారు చేయడంలో బంటుమిల్లి కొమ్మారెడ్డి పబ్లిక్ స్కూల్ కృషిని గుర్తించి ప్రశంసిస్తూ హైదరాబాదుకు చెందిన బ్రెయిన్ ఫీడ్ టెక్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక జూరి అవార్డుకు కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూలు ఎంపిక చేశారు. హైదరాబాద్ మాదాపూర్ లోని హైటెక్స్ లో జరిగిన అవార్డ్స్ ప్రధానోత్సవం కార్యక్రమంలో కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య ఈ అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా ఇదే కార్యక్రమంలో అత్యుత్తమైన విద్యా ప్రమాణాలు అత్యుత్తమ మౌలిక వసతులు, అత్యుత్తమ విద్య, సాంస్కతిక కార్యక్రమాలు అనే మూడు విభాగాలలో టెన్త్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు, ఈ టెక్ టెన్త్ ట్రైన్ బ్లేజర్ అవార్డులను కూడా ప్రదానం చేశారు. ఈ అవార్డును హైదరాబాద్ హైటెక్స్‌లో ఎస్ ఎం ఆర్ మహేష్ బాలకష్ణ, సీనియర్ డెవలప్మెంట్ అండ్ రికగ్నిషన్ మేనేజర్ ఐ బి సౌత్ ఏషియా, బ్రెయిన్ ఫీడ్ చీఫ్ మేనేజర్ శాస్త్రి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొమ్మా రెడ్డి కిషోర్ మాట్లాడుతూ ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బందికి కతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు కొమ్మారెడ్డి వెంకటే శ్వరరావు, ముత్యారత్నంకి, విద్యార్థులు తల్లిదండ్రులకు ఉపాధ్యా యులకు ఈ అవార్డులను అంకితం చేస్తున్నామని తెలిపారు.





పోటీలతో ప్రతిభకు పదును

ప్రజాశక్తి-వన్‌టౌన్: చదువుతో పాటు వివిధ రకాలైన పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభ మరింత పెరుగుతుందని కె.బి.ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. వైబ్రెన్స్ పేరుతో కళాశాల ప్రజ్ఞ విభాగం నిర్వహించనున్న పోటీల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం కాలేజీ కార్యాలయంలో జరిగింది. పోస్టర్ ఆవిష్కరించిన శ్రీనివాసు మాట్లాడుతూ శనివారం పోటీలు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం జరిగే ముగింపు సభలో బహుమతులు అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ వ్యాసరచన (ఇంగ్లీషు, తెలుగు), క్విజ్, వక్తత్వం, వెస్టన్ గ్రూప్ డ్యాన్స్, యాడ్ ఎక్స్ ప్రెస్, స్టాండప్ కామెడీ, ఫ్లాష్ మాబ్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. తగిన గుర్తింపు పత్రాలు సమర్పించి, డిగ్రీ చదివే విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రజ్ఞ కన్వీనర్ బి.మోహన్ తేజ, కాలేజీ ట్రెజరర్ హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకష్ణ, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ పాల్గొన్నారు.

భవానీ దీక్షా విరమణ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నందు ఈనెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరగబోవు భవానీ దీక్షా విరమణలు పురస్కరించుకొని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.



రాజశేఖర్ బాబు ఆలయ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. భవానీ దీక్షా విరమణ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వచ్చే భవానీ యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయుటలో భాగంగా గురువారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఆలయ ఈఈ టి. వైకుంఠరావు, ఏడీసీపీ రామకష్ణ, నగర పశ్చిమ ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ మరియు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి హోమగుండాల ఏర్పాటు, ఇరుముడి పాయింట్లు, అన్నదానం, ప్రసాదం కౌంటర్లు, క్యూ లైన్‌లు, కనకదుర్గ నగర్, బందోబస్త్ నిర్వహణ, గిరి ప్రదక్షిణ రూటు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో సమీక్షించారు

22 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో కొండ సమీపంలో పేకాట ఆడుతున్న 22 మంది పేకాట రాయుళ్లు ను నందిగామ పోలీసులు అరెస్టు చేసి గురువారం నందిగామ పోలీసు స్టేషను కు తరలించారు. పట్టుబడిన వారంతా నందిగామ చెందిన బడాబాబులే. మోటారు వాహనాలు సీజ్ చేసి నట్లు నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-భవానీపురం: నేటి నుంచి పశ్చిమ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ మండల తహశీల్దార్ ఎస్.కె. ఇంతియాజ్ పాషా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలలో ఐదు రోజుల పాటు ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. ఈనెల 6వ తేదీ శుక్రవారం భవానీపురం ఎంఆర్ఓ కార్యాలయం పక్కన గల ఖాళీ స్థలంలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకూ అలాగే 10వ తేదీ మంగళవారం విద్యాధరపురంలోని షాదీఖానాలో, 12వ తేదీ గురువారం వన్‌టౌన్‌లోని గాంధీ మహిళా కళాశాలలో, 18వ తేదీ బుధవారం పాత రాజరాజేశ్వరీపేటలోని 222 సచివాలయం ప్రాంతాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ ఇంతియాజ్ పాషా తెలిపారు. **వత్సవాయి:** ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వత్సవాయి తాసిల్దార్ సూర్యారావు తెలిపారు. 6న గోపినేనిపాలెం, 9న కన్నివేడు, 10న కాకరవాయి, 11 ఇందుకుపల్లి రామచంద్రపురం, 12 వేముల నర్వ గ్రామాల్లో గ్రామ సభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. **మైలవరం:** మండలంలోని మోర్సుమల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరుగుతుందని తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయంలో జరిగే ఈ సదస్సు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. **వీరులపాడు:** ఈ నెల ఆరో తేదీ నుండి 24వ తేదీ వరకు మండలంలో రెవిన్యూ సదస్సులు జరుగుతాయని తాసిల్దార్ షేక్ హుస్సేన్ తెలిపారు. 6న ఎల్లంకి, 9వ తేదీ గోకరాజు పల్లి, పదో తేదీ జయంతిలో సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

సాంకేతికతతో స్వచ్ఛత వైపు అడుగులు : పట్టాభి

ప్రజాశక్తి-విజయవాడ: స్వచ్ఛత వైపు సాంకేతిక అడుగులు వేస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో డ్రోన్ సర్వేలన్స్ అవసరం అని, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో గురువారం విఎంసిలోని ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో స్వచ్ఛ విజయవాడ కొరకు సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ మాట్లాడుతూ స్వచ్ఛతకు సాంకేతికత ఎంతో అవసరమని అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ ని వాడుతూ పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే దిశలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పని చేయాలని అని అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛందర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యర్థ నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు డ్రోన్ల నిర్వహణను సమన్వయం పరుస్తూ డ్రోన్ సర్వేలెన్సు ద్వారా ప్రస్తుతం ఉన్న సమస్యలను ఎలా తీర్చవచ్చు ఎలా తీర్చగలము లాంటి అంశాలపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న వ్యర్థ నిర్వహణలో ఉన్న పలు సమస్యలను వివరించారు. దోమలు పెరగకుండా ఉండేందుకు, బ్లాక్ స్పాట్స్ ను గుర్తించేందుకు, కుక్కలు, ఆవుల వివరాలు సేకరించేందుకు మరియు ఇతర అంశాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డ్రోన్ సర్వే లైన్స్ పని చెయ్యాలి అని అన్నారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభిరామ్

సమావేశంలో స్వచ్ఛంద్ర కార్పొరేషన్ యంసి 1 భాగ్యలక్ష్మి, యం సి 2 దశరథ్ రామి రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్ర, విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ వెహికల్స్ ఎస్ పాదం, బయాలజిస్ట్ సూర్య కుమార్, డ్రోన్ టీం సభ్యులు, నియో స్కై నిపుణులు శరత్చంద్ర, హను పాల్గొన్నారు.

ఎటిఎం దొంగ అరెస్ట్

రూ. 2 లక్షల నగదు, 78 ఎటిఎం కార్డులు స్వాధీనం



ప్రజాశక్తి-విజయవాడ: ఎటిఎంలు మార్చి దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. రెండు లక్షలతో పాటు 78 ఎటిఎం కార్డులను స్వాధీనం చేసుకున్న సంఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ ఎసిపి యు బంగారురాజు నిందితుడి వివరాలను వెల్లడించారు. స్థానిక పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీపంలో విజయవాడ వాంబేకాలనీకి చెందిన చింతల సురేష్‌బాబు అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. 2017లో తన జల్సాల కోసం డబ్బులు తీయడానికి ఎటిఎం వద్దకు వెళ్లగా, కార్డులో డబ్బులు లేకపోవడంతో ఆ సమయములో అక్కడకు వచ్చిన వృద్ధుడు డబ్బులు తీసిపెట్టమని అడుగగా వెంటనే డబ్బులు తీసి డబ్బులతో పాటు నకిలీ కార్డును ఇచ్చి పంపించి వేశాడు. తరువాత ఎటిఎం కార్డు నుంచి డబ్బులు తీసుకొని జల్సాలు చేశాడు. దీంతో ఈ నేరాన్ని తన ప్రవృత్తిగా మార్చుకొని వివిధ ఎటిఎంల వద్ద తిరుగుతూ అమాయక ప్రజలను గమనించి, వారికి సహాయం చేస్తున్నట్లు వారిని ఏ మార్చి వారి ఎటిఎం కార్డులను మారుస్తూ వాటి నుంచి డబ్బులను తీసుకొని వెళ్లిపోయేవాడన్నారు. ఈ విధంగా నిందితుడు సురేష్‌బాబు 25కు పైగా నేరాలు చేశాడన్నారు. విజయవాడలోనే కాకుండా తెలంగాణాలోని కోదాడ, హుజుర్‌నగర్, సూర్యాపేట, తెనాలి, గుంటూరు, నూజివీడు, కృష్ణాజిల్లా, తాడేపల్లి గూడెం, రావులపాలెం, అమలాపురం, బీమాడోలు , ఉవ్యూరు, కంకిపాడు, నందిగామ, కడప, నంద్యాల తదితర ఏరియాల్లో ఎటిఎంల వద్ద అమాయకుల వద్ద నుంచి ఎటిఎం కార్డులను మార్చి డబ్బులను తస్కరించేవాడన్నారు. ఈ కేసు చేధించడానికి కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని సిపి అభినందించారు.



ఆకుల శ్రీనివాస్‌కు పరామర్శ

ప్రజాశక్తి-వన్‌టౌన్

పుత్ర శోకంతో బాధపడుతున్న సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి పరామర్శించారు. గురువారం భవానీపురంలోని ఆకుల శ్రీనివాస్ స్వగహానికి వచ్చిన రఘురాం, అప్పి రెడ్డి తొలుత స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజకుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే ఆకుల శ్రీనివాస్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. పేద ప్రజల పట్ల ఎంతో సానుభూతితో ఉండే డాక్టర్ రాజ్ కుమార్ అకాల మతి తమను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భగవంతుడు డాక్టర్ రాజ్ కుమార్ ఆత్మకు శాంతిని ప్రసాదించాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల

పరిధి పరిటాల పరిధిలో గురువారం ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న ఐషర్ వాహనాన్ని హైదరాబాద్ వైపు నుండి విజయవాడ వెళ్తున్న పల్సర్బ్ బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం పెద్దపులిపరు గ్రామానికి చెందిన కాట్రగడ్డ ప్రమోద్ (21) అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కెబిఎన్ కళాశాల సందర్శన


ప్రజాశక్తి-వన్‌టౌన్: నేటి ప్రపంచంలో ప్రతి క్షణానికీ మారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాన్ని, అత్యాధునికంగా వస్తున్న ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నిరంతం పరిశీలన, పరిశోధన, అన్వేషణ దష్టితో చదువుకోవాలని, అప్పుడే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి అన్నారు. గురువారం కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాల విద్యార్థులు కెబిఎన్ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాలలోని అడ్వాన్స్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీలను సందర్శించారు. కంప్యూటర్ రంగంలో ఆధునిక అంశాలైన మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ తదితర అంశాలను



అధ్యాపకులు వారికి వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కష్ణవేణి మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంతో పాటు నేర్చుకున్న విషయాలను అనువర్తనం చేసే నేర్పును కూడా విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి బి.మోహన్ తేజ, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

ప్రపంచ నేల పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి-మైలవరం: ప్రపంచ నేల పరిరక్షణ దినోత్సవాన్ని స్థానిక ఆర్‌ఎస్‌కెలలో, ఎల్బీఆర్‌సీఈ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేలను ఆరోగ్యంగా ఉంచుకోవటానికి సేంద్రీయ కర్బనం 0.75శాతం కన్నా ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పచ్చిరొట్ట



తిరువూరులో...

విత్తనాలు జీలుగా, జనుము, పిల్లి పెసర పశువుల ఎరువు, వానపాముల ఎరువును నేలకు వేయడం ద్వారా సేంద్రీయ కర్బనాన్ని పెంచుకోవచ్చు అన్నారు. సూక్ష్మ పోషక లోపాలు సవరించుకొని ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చు అన్నారు. రబీ సీజన్లో వేసే మొక్కజొన్న, వరి, సెనగ పంటలకు ప్రధానమంత్రి పంటల భీమా పథకం ద్వారా లాభం పొందాలని సూచించారు. **వత్సవాయి:** రసాయన ఎరువులు వాడటం వల్ల భూమిలోని సారం తగ్గిపోతుందని కెవికె కోఆర్డినేటర్ కె అచ్యుతరావు అన్నారు. కన్నెవీడు గ్రామంలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. రసాయన ఎరువులు వాడటం వల్ల వచ్చే చెడు ఫలితాలను డాక్టర్ పి.ఎన్.శివప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ.వెంకట్ రెడ్డి, డాక్టర్ ఎన్.రాజశేఖర్, డాక్టర్ టి.జస్వంత్ రెడ్డి పాల్గొన్నారు. **తిరువూరు:** ప్రపంచంలోని జీవకోటికి ఆహారం అందించే నేల తల్లిని కాపాడుకోవాలని



వత్సవాయిలో...

తిరువూరు మండల వ్యవసాయ అధికారిణి పద్మ అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గొల్లమందల శ్రీనివాసరావు రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు కె.శాంతకుమారి పాల్గొన్నారు. **విస్సన్నపేట:** విస్సన్నపేటలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మోనీషా రైతు సేవ కేంద్రం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి, మద్దతు ధర దక్కేలా విక్రయించుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ (జె.సి) డాక్టర్ నిధిమీనా కోరారు. ఈమేరకు బుధవారం జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులకు, తహసీల్దార్లకు, మండల వ్యవసాయ అధికారులకు, రెవిన్యూ సిబ్బందికి, సివిల్ సప్లైస్ సిబ్బందికి, వ్యవసాయ శాఖ సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మిల్లర్లుకు జెసి పలు ఆదేశాలు జారిచేశారు. ఆ వివరాలను జ.సి మీడియాకు వివరించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏటువంటి ఇబ్బంది కలగకుండా వారిని అప్రమత్తం చేసి, కల్లాలలోని ధాన్యాన్ని వెంటనే కోనుగులు చేసి మిల్లులకు రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరం అయిన గోనె సంచులు, లేబర్, రవాణా వాహనాలు, మిల్లులకు బ్యాంక్ గ్యారంటీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 157 రైతు శిక్షణ కేంద్రాలు ఉన్నాయన్నారు.జిల్లాలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోరాదని అన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సునీత శర్మ ప్రధానోపాధ్యా యులను కోరారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పాఠశాలలో, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీత శర్మ మాట్లాడుతూ గ్రామస్తులను పేరెంట్స్ ని సగర్వంగా ఆహ్వానించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. ఎంఈఓ రత్న శ్యాంబాబు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బిసి వెల్ఫేర్ అధికారి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : చిల్లకల్లు క్లస్టర్ పరిధిలోని మంగొళ్ళ గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్, పశుసంవర్ధక శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా పశువైద్య శిబిరంను గురువారం యూనియన్ పాలక వర్గ సభ్యులు చెరుకూరి లవయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇంజం రామారావు , కష్ణా మిల్క్ యూనియన్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డా. ప్రసాద్ లింగం , డిప్యూటీ డైరెక్టర్ నందిగామ డా. "మోజెస్ వేస్లీపాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ లింగం పాడిరైతులు పశు పోషణ లో తీసుకోనవలసిన జాగ్రత్తలు వివరించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు .

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 6వ తేదీ నుండి 30వ తేదీ వరకు మండలంలోని గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల తాసిల్దార్ లోక్ రాజు గురువారం తెలిపారు. 6వ తేదీ చంద్రాల గ్రామంలో ఏడవ తేదీ శేరీ కలవపూడి, 9వ తేదీ మామిడి కోళ్ల, 10 న పెసరమెల్లి, 11న వెలుతురు మిల్లి, 12న అంగలూరు, 13న గుడ్లవల్లేరు, వేమునిగుంట, 16న పెంజెండ్ర, 17న చిత్రం, 18న డోకిపర్రు, 19న విన్నకోట, 20న కూరాడ, 21 శరీరగ్గుమిల్లి, 23న కవుతరం, 24న వేమవరం, నాగవరం, వేమవరపుపాలెం, 26 నఉలవలపూడి, 27న వడ్లమన్నాడు, 28న గాదేపూడి, 30న చిన్నగొన్నూరు, పురిటిపాడు గ్రామాల్లో ఆయా తేదీల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తాసిల్దార్ కోరారు. **ప్రజాశక్తి-నాగాయలంక :** ఈ నెల 6 వతేదీ నుంచి 24 వరకు మండలంలోని రెవెన్యూ గ్రామాలలో సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీలదార్ ఎం. హరనాథ్ తెలిపారు.6 న నాగాయలంక, 10న తలగడదీవి,11న రేమాల వారిపాలెం, మర్రిపాలెం,12 తలగడదీవి, 13న భావదేవరపల్లి, 17న సంగమేశ్వరం, కమ్మనమోలు,18న గణపేశ్వరం, సొర్ల గొంది,19న పర్రచివర, 20న ఏటిమొగ, గుల్లలమోద, 21న నాచుగుంట, ఎదురుమొండి, 24న నంగేడ్డ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **ప్రజాశక్తి-గూడూరు :** మండలంలో శుక్రవారం నుండి ఈ నెల 21 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి రాజ్యలక్ష్మి తెలిపారు.ఈ సదస్సులలో పెట్టుకొను అర్జీలు కాస్ట్,ఇన్కమ్, ఎఫ్ఎంసి వంటి సర్టిఫికెట్స్ ల కు సిటిజెన్ చార్జీలు కూడా మినహాయించినట్లు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులు ఉదయం 9 .30 నుండి సాయంత్రం 5 గంటలవరకు ప్రతి రోజు రెండు గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి మండలంలో శుక్రవారం నుంచీ రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని చల్లపల్లి తహసీల్దార్ డి. వనజాక్షి గురువారం తెలిపారు. 6వ తేదీ శుక్రవారం చల్లపల్లి, 10వ తేదీ వక్కలగడ్డ, 11వ తేదీ లక్ష్మీపురం, 17వ తేదీ పురిటిగడ్డ, 19వ తేదీ పాగోలు, 21వ తేదీ యార్లగడ్డ, 24వ తేదీ వెలివోలు, చీడేపూడికి సంబంధించి యార్లగడ్డలో, 26వ తేదీ మంగళాపురం, 27వ తేదీ నడకుదురు, ఆముదార్లంక, 28వ తేదీ మాజేరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచీ సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామనీ, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచీ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

విద్యార్థుల శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్స్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎస్‌టిఓ కార్యాలయంలో అందిస్తున్న జాబు ట్రైనింగ్ ప్రోగ్రాంను ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి సాల్మన్ రాజు గురువారం పరిశీలించారు. విద్యార్థులు చేస్తున్న పనిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి కొన్ని సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఓ కళాశాల అధ్యాపకులు దొడ్డు కష్ణారావు, అన్నపరెడ్డి శ్రీనివాసరావు, ఎస్ దిలీప్ కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సాల్మన్ రాజు



టిడిపి సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-చల్లపల్లి : కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలుగు దేశం మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు అన్నారు. గురువారం చల్లపల్లి మండలం చల్లపల్లిలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నూతన సభ్యులకు, రెన్యూవల్ చేయించుకున్న వారికి సభ్యత్వం కార్డులు అందచేశారు.

ఇంటి పన్నులు వసూలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గ్రామ ప్రజలు తమ ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివద్ధికి తోడ్పాటు నివ్వాలని పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. 2024 సంవత్సరం ఇంటి పన్నులు, వ్యాపార షాపుల పన్నులు, నీటి కుళాయిల పన్నులను సకాలంలో చెల్లించాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం సేకరణలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది, అధికారులను హెచ్చరించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి తహసిల్దార్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇతర రెవెన్యూ సిబ్బందితో ధాన్యం సేకరణ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం (ఆర్.ఎస్.కె) నుంచి అనుమతి లేకుండా ఒక్క ధాన్యం బస్తా కూడా మిల్లుకు వెళ్లడానికి వీల్లేదని, దీనిని ఉల్లంఘించినా లేదా దళారులను ప్రోత్సహించినా వెంటనే సంబంధిత అధికారి, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం సేకరణ విషయంలో కొంతమంది టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు దళారులను ప్రోత్సహిస్తూ తోడ్పాటు అందిస్తున్నట్లు తన దష్టికి వచ్చిందని, ఇంకొంతమంది వారే దళారులుగా అవతారమెత్తి లబ్ధి పొందుతున్నారన్న ఫిర్యాదులు అందాయని, అదే నిజమైతే అట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దళారులు ఎవరైన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిస్తే పైఅధికారులకు సమాచారం అందించాలని సూచించారు.రైతు సేవ కేంద్రం వద్ద నమోదు చేసిన తేమ శాతమే తుది నిర్ణయమని, ఈ విషయంలో మిల్లుల వద్ద ఎలాంటి బేరాలు ఉండకూడదని, రైతుకు నష్టం వాటిల్లేల వ్యవహరించవద్దని కస్టోడియన్ అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ పద్మావతి, పౌర సరఫరాల శాఖ అధికారిణి వి పార్వతి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మ దేవి, జిల్లా సహకార అధికారి కే చంద్రశేఖర్, ఏడి మణిధర్ తదితరులు కలెక్టర్ తో పాటు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన జేసీ

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాతపెన్షన్ విధానం అమలుతో పాటు ఇతర సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏపీ సీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఈనెల 10న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమంలో ఉద్యోగులు, పెన్షనర్లు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాంచారయ్య అన్నారు. స్థానిక నాగళ్లరాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సీపీఎస్ఈఏ జిల్లా కమిటీ, పెన్షనర్స్ అసోసియేషన్తో కలసి ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాంచారయ్య మాటా ్లడుతూ సీపీఎస్ ఉద్యోగులతో పాటు పెన్షనర్లు ఛలో విజయవాడ కార్యక్రమంలో పాలొని ఓపీఎస్ సాధించాలన్నారు. అసోసి యేషన్ ఆర్థిక కార్యదర్శి వీరయ్య నాయక్, జిల్లా పెన్షనర్స్ అసోసి యేషన్ కె.సా ంబిరెడ్డి, జనరల్ సెక్రటరీ హాసన్ అహ్మద్, కేప విశ్వమోహన్, పరాత్పరి పాల్గొని సీపీఎస్ ఉద్యోగులకు మద్దతు పలికారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కళ్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి కళ్యాణ మహెూత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.ఆలయ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ శుక్రవారం నుంచి 8వ తేదీ ఆదివారం వరకు షష్టి కల్యాణ మహెూత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షష్టి కల్యాణ మహెూత్సవాలలో మొదటి రోజైన ఆరవ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, రాత్రి ఏడు గంటల నుంచి యాగశాల ప్రవేశము, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, రుత్విగ్వరణ అంకురారోపణ, వాస్తు పూజ, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండవ రోజు అయిన ఏడవ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి ప్రాతః కాలార్చనలు, గోపూజ, నిత్య హెూమము, బలిహరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11 గంటల నుంచి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహెూత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు మయూర వాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజైన ఎనిమిదవ తేదీ ఆదివారం ఉదయం ఆరు గంటలకు ప్రాత కాలార్చనలు, గోపూజ, నిత్య హెూ మం, బలిహరణ, పంచామత స్థపన, వసంతోత్సవము, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు సాంప్రదా యబద్ధంగా జరుగుతాయన్నారు. అదే రోజు 11 గంటలకు శేష వాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ స్వామివారి పుష్ప శయ్యాలంకత పర్యంక సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

విక్కుర్తి శ్రీనివాస్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవని గడ్డలోని శ్రీ లక్ష్మీ దత్త సాయి మందిరంలో గురువారం కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజా రులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ విజయలక్ష్మి దంపతులను, శ్రీనివాస్ సోదరుడు రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈసందరభంగా పలువురు వారిని అభినందించారు.




కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యబాబు, కార్మికులు

ఆప్కాస్ కార్మికుల వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థ వివిధ విభాగాలలో ఆప్కాస్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి నవంబర్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలిసి నగర కమిషనర్ ధ్యానచంద్రకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ వేతనాలు చెల్లించకపోవడం వలన కార్మికులకు జీవనం సాగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే నగరపాలక సంస్థ లో స్వచ్ఛ సర్వేక్షన్ ,కరోనా సందర్భంగా ,దసరా ఉత్సవాలు భవాని దీక్షల విరమణ ,ఎన్నికల సమయంలో ,వివిధ డ్రైనేజీ మురుగు తొలగింపు కార్మికులుగా వివిధ సందర్భాలలో తాత్కాలికంగా పనిచేస్తున్న కార్మిలకు అందరిని నగరపాలక సంస్థ కాంట్రాక్టు నిత్య ఉపాధి కార్మికులుగా నియమించుటకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేషన్ అవసర సందర్భంలో పని కల్పిస్తూ, మిగిలిన టైం లో ఉపాధి లేకపోవడం వలన వారు తీవ్ర జీవన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ,వారికి కాంట్రాక్టు పద్ధతిలో శాశ్వత ఉపాధి కార్మికులుగా నియామకం చేయుటకు తగు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై కమిషనర్ గారు స్పందించి వెంటనే తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ప్రిన్సెస్ ఆఫ్ ఎపిగా జశ్విక

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డిఎవి పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్న బి.జశ్విక నున్నలో ఉన్న ఆయుష్ రిసార్ట్స్‌లో సతీష్ అడ్డాల ఆర్గనైజేషన్ నిర్వహించిన ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 4 నుండి 6 సంవత్సరాల బాలబాలికల విభాగంలో సెమీఫైనల్ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచింది. ఆ తరువాత జరిగిన ఫైనల్ పోటీలో పాల్గొని మొదటి శ్రేణిలో గెలిచి ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా నిలిచి కిరీటాన్ని సొంతం చేసుకొంది. ఇందుకు లక్ష రూపాయల గిఫ్ట్ వోచర్ పురస్కారంతో పాటు షీల్డ్‌ను, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ గెలుచుకుంది. ఈ సందర్భంగా చిన్నారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి మన్మోహన్, వీటీపీఎస్ యాజమాన్యం తరపున చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు, డిప్యూటీ సెక్రటరీ సుశీల అభినందించారు.





ముఠా కార్మికులకు అవగాహన

విజయవాడ: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్ ఎదురుగా గల ముఠా కార్మికులకు నవజీవన్ సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా కార్మికుల ఇన్‌ఛార్జి రాంబాబు మాట్లాడుతూ నవజీవన్ బాల భవన్ సంస్థ గత 35 సంవత్సరాల నుండి విజయవాడలో పిల్లల గురించి పని చేస్తుందన్నారు. ఈ సంస్థ వల్ల విజయవాడ నగరంలో వీధుల్లో తిరుగుతున్న పిల్లల సంఖ్య తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత వికాస్ కళాశాల

ముగిసిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల టోర్నీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ విద్యాసంస్థల ఆవరణలో విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. నాకౌట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌కు యూనివర్సిటీ పరిధిలోని కష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల నుంచి మొత్తం పది జట్లు హాజరవ్వగా, నాలుగు జట్లు లీగ్‌లోకి ప్రవేశించాయి. వికాస్ బీపీఈడీ కాలేజీ జట్టు ఆడిన మూడు లీగ్ మ్యాచ్‌లలనూ విజయాలు సాధించి ప్రథమస్థానంలో నిలవడమే కాకుండా కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. రెండు మ్యాచ్‌లలో గెలుపొందిన విజయవాడకు చెందిన పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జట్టు రెండోస్థానంలో, ఒక విజయంతో విజయవాడకు చెందిన ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల మూడోస్థానంలో నిలిచా యి. కాగా, లీగ్‌లో ఒక్క మ్యాచ్ కూడా గెలవని మైలవరానికి చెందిన ఎల్‌హెచ్‌ఆర్ డిగ్రీ కాలేజీ నాలుగోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో మదర్ థెరిసా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి



నరెడ్ల సత్యనారాయణరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ బీసీహెచ్ సంగీతరావు, సెలెక్షన్ కమిటీ సభ్యులు బీ మణి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు మన్నే స్వామి, డాక్టర్ కష్ణారెడ్డి, నాగరాజు, హేమచంద్ర, డీ యుగంధర్, డాక్టర్ దారం నవీన్ కుమార్, టోర్నమెంట్ నిర్వహక కమిట చైర్మన్, విజయ బీపీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ ఉదయ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కడప జిల్లా రాయచోటి కొత్తపాలెం ఉర్దూ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సంఘటనలో ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడు మరణించిన సంఘటన అమానుషమని ఫ్యాప్టో తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. గురువారం ఇబ్రహీంపట్నం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహశీల్దార్, మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ సయ్యద్ ఖాసిం, మండల శాఖ బాధ్యులు కె శ్రీనివాసరావు, వి నరేంద్ర, కె జే ఆర్మ్ స్ట్రాంగ్, బి రెడ్ స్టార్, పి వి దుర్గాప్రసాద్, షేక్ మునీర్ భాష, పి కష్ణారావు లు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం:** జడ్‌పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన





తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కే రవిబాబు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** రాయచోటి-కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు పై విద్యార్థుల దాడి మతి కి కారకులైన దోషులని కఠినంగా శిక్షించాలని నందిగామ మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్యాప్టో ఆద్వర్యంలో నందిగామ మండల విద్యా శాఖ అధికారి పద్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ నాయకులు మహేశ్వర వెంకటేశ్వరరావు, బొద్దుకోలు రమణయ్య, కుంచం లక్ష్మీ నారాయణ, చినం నరసింహారావు, బెనర్జీ, ఎపిటిఎఫ్ నాయకులు మద్దినేని నాగేశ్వరరావు, బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

మంగళగిరి, మూలపాడుల్లో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్, ఇబ్రహీంపట్నం: బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూఫ్ క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి మంగళగిరిలోని క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్లలో మ్యాచ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు. మూలపాడులో రెండు మ్యాచ్‌లు, మంగళగిరిలో ఒక మ్యాచ్ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అవుతాయి. డిసెంబర్ 6 నుంచి 8 వరకు కర్ణాటక- విదర్భ మంగళగిరిలో, రాజస్థాన్-ఝూర్ఖండ్ జట్ల మధ్య మ్యాచ్, అస్సోం-ఉత్తరాఖండ్ మ్యాచ్ మూలపాడులో, 11 నుంచి 13 వరకు రాజస్థాన్-ఉత్తరాఖండ్ మ్యాచ్ మంగళగిరి, ఝూర్ఖండ్-కర్ణాటక, జమ్మూ కశ్మీర్-విదర్భ మ్యాచ్ మూలపాడులో, 17 నుంచి 19 వరకు రాజస్థాన్-విదర్భ మ్యాచ్ మంగళగిరి, జమ్మూ కశ్మీర్-కర్ణాటక, ఝూర్ఖండ్-ఉత్తరాఖండ్ మూలపాడులో, 22 నుంచి 24 వరకు కర్ణాటక-ఉత్తరాఖండ్ మంగళగిరిలో, రాజస్థాన్-జమ్మూకశ్మీర్, ఝూర్ఖండ్-విదర్భ మూలపాడులో, 28 నుంచి 30 వరకు జమ్మూ కశ్మీర్-ఝూర్ఖండ్ మంగళగిరిలో, ఉత్తరాఖండ్-విదర్భ మ్యాచ్ మూలపాడులో జరగనుంది.

విద్యుత్ భారాలపై నిరసనలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం మొగల్‌రాజుపురంలో బందిరిదొడ్డి సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోయలేని భారాలు ప్రజలపై మోపుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో 20 వేల కోట్లు భారాలు వేస్తే బాదుడే బాదుడు అంటూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారని, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే 15.5 వేల కోట్ల భారాలు మోపినది ఏ రకమైన బాదుడని



63వ డివిజన్‌లో కొవ్వొత్తులతో నిరసన

ప్రశ్నించారు. కేంద్రం చెప్పినట్లు తలాడిరచిన గత ప్రభుత్వ పరిస్థితి ఏమైందో అదే గతి ఈ ప్రభుత్వానికి పడుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రశ్నించడానికే పార్టీ అన్న పెద్ద మనిషి ఇప్పుడు ప్రజలపై ఇబ్బడిముబ్బడిగా భారాలు వేస్తున్నారన్నారు. గత అనుభవాలను మరోమారు నెమరువేసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు గుండిమెడ క్రాంతి, నగర నాయకులు పటమట మురహరి, దావులూరి శ్రీనివాస్, దూపం శివకుమార్, శేషుకుమారి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: ట్రూఆఫ్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఈరోజు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో 63వ డివిజన్ సుందరయ్య నగర్ వద్ద కొవ్వొత్తులతో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు మాట్లాడుతూ ట్రూఆఫ్, సర్దుబాటు చార్జీలు రద్దు చేసేంత వరకు పోరాటం ఆపేది లేదని తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు పెట్టమని కరెంటు చార్జీలు పెంచమని విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకుంటామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. విద్యుత్ అవినీతికి పాల్పడిన ఆదానిపై వెంటనే కేసులు పెట్టాలని లేనిపక్షంలో ప్రజలే తెలుగుదేశం కూటమి



మొగల్‌రాజపురంలో సిపిఎం ధర్నా

పై తిరగబడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, స్థానిక నాయకులు పి.సాంబిరెడ్డి, ఎల్. నిర్మల, పి.జగన్, భవానీలతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పెంచిన ట్రూ అప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లురద్దు చేయాలని కోరుతూ వాంబేకాలనీ ఈ బ్లాక్‌లో స్థానిక ప్రజలు గురువారం ఆందోళన నిర్వహించారు. వీరి ఆందోళనకు సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె దుర్గారావు మద్దతు నిచ్చి మాట్లాడారు. ప్రజలకు భారమైన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని లేనట్లయితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అలాగే ప్రజలకు ఉరితాళ్లుగా తయారయిన స్మార్ట్ మీటర్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు సిపిఎం నాయకులు ఎస్‌కె పీరుసాహేబ్, డివైఎఫ్ఐ కార్యదర్శి పి రవి, ఎస్ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.